# సాక్షి ఖమ్మం

ఆదివారం । 23 । జూన్ । 2024






**జవాన్ల చేతివాటం**

కేఎంసీలో కార్మికులను కొందరు జవాన్లు డబ్బుల కోసం వేధిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

8లో



**హాజరుశాతం పెంచాలి**

పాఠశాలల్లో నమోదైన విద్యార్థులందరూ హాజరయ్యేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని డీఈఓ శర్మ సూచించారు.

8లో

గరిష్టం / కనిష్టం

32° / 26°

**వాతావరణం**

జిల్లాలో ఆదివారం ఎండల ప్రభావం అంతగా ఉండదు. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



స్వామి దర్శనానికి బారులు దీరిన భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజామునే ఆలయ ఆవరణలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా హాజరైన భక్తుల సమక్షాన నిత్య కల్యాణం జరిపించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించగా పాల్గొన్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ. జగన్మోహన్‌రావు, చైర్మన్ శ్రీరామచంద్ర మూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, బృంది పాల్గొన్నారు.

### మత్స్యకారులకు రూ.5 లక్షల ప్రమాద బీమా

ఖమ్మంవ్యవసాయం: మత్స్యకారుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పేరిట ప్రమాద బీమా సౌకర్యం కల్పించిందని జిల్లా మత్స్య శాఖ అధికారి డి.ఆంజనేయస్వామి తెలిపారు. జిల్లాలోని మత్స్య పారిశ్రామిక సంఘాల్లో సభ్యులుగా ఉండి, ఈ ఏడాది మే 3వ తేదీ నాటికి టీ మత్స్య పోర్టల్‌లో నమోదైన సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని వెల్లడించారు. ఈమేరకు సంఘాల్లోని సభ్యులెవరైనా మరణిస్తే వివరాలను మూడు రోజుల్లోగా వివరాలను తమ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. సభ్యుడి ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, సంఘం రిజిస్టర్ జిరాక్స్ ప్రతి, పాన్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించాలని ఆంజనేయస్వామి సూచించారు.

### ప్రారంభమైన పాలిసెట్ కౌన్సెలింగ్



విద్యార్థికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి చేపట్టిన పాలిసెట్ కౌన్సెలింగ్ శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు తొలిరోజు 320మంది విద్యార్థుల్లో 318మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, కౌన్సెలింగ్ కో ఆర్డినేటర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. కాగా, ఈ ప్రక్రియ 25వ తేదీ వరకు కొనసాగనుండగా, ఈనెల 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని.. ఆతర్వాత 30వ తేదీన కేటాయింపు ఉంటుందని వెల్లడించారు.

### వసతిగృహాల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా సంక్షేమ అధికారులు కృషి చేయాలని శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ ఆదేశించారు. ఖమ్మంలోని కార్యాలయంలో శనివారం ఆయన సంక్షేమ అధికారులతో సమావేశమై వసతిగృహాల్లో సమస్యలు, భవనాల స్థితిగతులు, విద్యార్థుల ప్రవేశాలు, హాజరుపై చర్చించారు. ఈ సందర్భంగా డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ వసతిగృహాల భవనాల్లో చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలని సూచించారు. మిగతా సమస్యలపై ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. అంతేకాక గత ఏడాది పెండింగ్ బిల్లులకు అవసరమైన బడ్జెట్ వివరాలు ఇవ్వాల్సని సూచించారు. ఈ సమావేశంలో ఏఎస్‌డీఓలు, వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.





ఖమ్మం జిల్లా కేంద్రంగా మీదుగా సాగుతూ కాలంతో సంబంధం లేకుండా నిత్యం నిండా నీటితో కళకళలాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించాల్సిన సాగర్ ప్రధాన కాల్వ ఇప్పుడు వెలవెలబోతోంది. గత ఏడాది కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవలేదు. దీంతో సాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే అడపాదడపా విడుదల చేశారు. ఇప్పుడు జూన్ నెల ముగియవస్తున్నా ఎగువ ప్రాంతంలోనే కాక జిల్లాలోనూ సరైన వర్షాలు లేక ప్రధాన కాల్వ మీదుగా నీటి ప్రవాహం మొదలుకాలేదు. దీంతో పూర్తిగా అడుగంటిన కాల్వ ఇప్పుడు యువకులకు మైదానంగా మారింది. ఖమ్మం నడిబొడ్డున టేకులపల్లి వంతెన పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ నగర్ యువకులు పలువురు శనివారం సాగర్ ప్రధాన కాల్వలో క్రికెట్ ఆడుతున్న దృశ్యమే ఇది. – ఖమ్మం అర్బన్





జిల్లాలో ప్రధాన జలాశయమైన వైరా రిజర్వాయర్ నానాటికి వట్టిపోతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 18.4 అడుగులకు గాను శనివారం 5.11 అడుగులకు పడిపోయింది. గత పదేళ్లలో ఈ స్థాయికి నీరు చేరడం ఇదే మొదటిసారి. ఉన్న కొద్దిపాటి నీటిని వైరా సహా 12 మండలాల్లో తాగునీటి అవసరాల కోసం రోజుకు కోటి లీటర్లకు పైగా విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్‌పై ఆధారపడిన రైతులు పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటగా.. వరి నార్లు పోయడానికి సిద్ధమవుతున్నారు. కానీ వర్షాలు లేక రిజర్వాయర్ ఎండిపోతుండడంతో రైతులకు నిరాశే మిగిలేలా ఉంది. ఇక రిజర్వాయర్‌ను 2వేల మందికి పైగా మత్స్యకారులు నమ్ముకోగా చేపల వేటకు అనుమతి ఇవ్వకపోవడంతో నిరుత్సాహం నెలకొంది. ఈనేపథ్యాన అందరూ వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. – వైరా

# సంతకం కావాలి సార్..



వివిధ పథకాలు, సర్టిఫికెట్లు, ఉద్యోగాల కోసం చేసుకునే దరఖాస్తులపై గెజిటెడ్ అధికారి సంతకం పెట్టించుకునేందుకు ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. దరఖాస్తు పూర్తిచేయడం, అవసరమైన సర్టిఫికెట్లు జత చేయడం ఒక ఎత్తయితే.. గెజిటెడ్ అధికారి సంతకం పెట్టించుకోవడం ఇంకో ఎత్తవుతోంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ప్రభుత్వ పథకాలకే కాక ఉద్యోగాల దరఖాస్తులైనా గెజిటెడ్ అధికారి సంతకం చేయించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో అధికారుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పలువురు ప్రదక్షిణలు చేస్తున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

- 'గెజిటెడ్' అధికారుల కోసం ఇక్కట్లు
- కొందరు అందుబాటులో లేక.. ఇంకొందరు సుముఖత చూపక..
- పథకాల కోసం సర్టిఫికెట్లపై సంతకం తప్పనిసరి
- ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రజల ప్రదక్షిణలు

**కొన్నింటికి తప్పనిసరి**

వివిధ ప్రభుత్వ పథకాలకే కాక ప్రభుత్వ ఉద్యోగాలకు, పోటీ పరీక్షలు, పైచదువుల దరఖాస్తులకు సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి చేయించాల్సి ఉంటుంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తు సమయాన దంపతులది మొదటి వివాహమేనని ధ్రువీకరించడానికి ఈ సంతకం అవసరం. అలాగే లీగల్ ఎయిడ్ సర్టిఫికెట్, పోటీ పరీక్షల దరఖాస్తులపై ఫొటో గుర్తింపు, పుట్టిన తేదీ సర్టిఫికెట్‌లో పేరు మార్పు, పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్, కోర్టుకు సమర్పించే జిరాక్స్ కాపీలపైనా గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలి. అప్పుడే ఆ దరఖాస్తులోని సమాచారమంతా వాస్తవమని ధ్రువీకరించినట్లవుతుంది.

**తప్పని ప్రదక్షిణలు**

దరఖాస్తులపై గెజిటెడ్ అధికారి సంతకం చేయించడం దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారుతోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల వారికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఏ కార్యాలయానికి వెళ్లినా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. తహసీల్దార్ కార్యాలయం, పాఠశాలలు, కళాశాలలు, పీహెచ్‌సీలు ఇలా ఏ కార్యాలయానికి వెళ్లినా సంతకం చేయించుకోవడం పలుమార్లు దుర్లభంగా మారుతుండగా.. కొందరు విసిగిపోయి పథకాలకు దరఖాస్తు చేయకుండానే వదిలేస్తున్నారు. తప్పనిసరిగా అవసరమైన వారు మాత్రం అధికారుల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

**కొందరు అధికారుల విముఖత**

దరఖాస్తులపై సంతకం చేసేందుకు కొందరు అధికారులు సంశయిస్తున్నట్లు తెలుస్తోంది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులతో పాటు ఇతర దరఖాస్తులపై సంతకాలు చేసిన పలువురు చిక్కులు ఎదుర్కొన్నట్లు సమాచారం. దీంతో తెలియని వారికి సంతకం చేయడానికి నిరాకరిస్తున్నట్లు తెలిసింది. ఇక మరికొందరు అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్తుండడంతో దరఖాస్తుదారులకు అందుబాటులో ఉండడం లేదు. ఆయా అంశాలను పరిగణనలోకి తీసుకుని గెజిటెడ్ అధికారి సంతకం విషయంలో వెసలబాటు కల్పించాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

**గెజిటెడ్ అధికారులు ఎవరంటే...**

గెజిటెడ్ అధికారుల్లో క్లాస్–1, క్లాస్–2 ఉన్నారు. వీరిలో ఆఫీసర్స్ ఆఫ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ప్రభుత్వ రీసెర్చ్ ఆర్గనైజేషన్స్‌లోని సైంటిస్టులు, యూనివర్సిటీల వీసీలు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ప్రిన్సిపాళ్లు, కేంద్ర, రాష్ట్ర యూనివర్సిటీల ఫ్యాకల్టీ మెంబర్లు, గ్రూప్–ఏ సర్వీస్ రూల్స్ కలిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు, డ్రగ్ కంట్రోలర్లు క్లాస్–1 జాబితాలోకి వస్తారు. ఇక డ్రగ్ ఇన్‌స్పెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఎస్‌డీఓ (సబ్ డివిజనల్ ఆఫీసర్), బీడీఓ (బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్), సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, ఆదాయ పన్ను శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు క్లాస్–2 గెజిటెడ్ ఆఫీసర్ల పరిధిలోకి వస్తారు. వీరే కాక ఇంకొందరు అధికారులు సైతం ఈ జాబితాలో ఉన్నారు.

# ఇద్దరు సీఐలపై సస్పెన్షన్ వేటు

- సత్తుపల్లి రూరల్ సీఐ, ఖమ్మం టు టౌన్ సీఐగా పనిచేసిన అధికారిపై చర్యలు
- దందాలకు సహకరించడం, తప్పుడు కేసుల వ్యవహారమే కారణం

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: పేకాట, ఇతర దందాలు నడిపిస్తున్న వారికి సహకరించడంతో పాటు తప్పుడు కేసులు నమోదు చేసినట్లు రుజువు కావడంతో ఇద్దరు సీఐలపై సస్పెన్షన్ వేటు పడింది. సత్తుపల్లి రూరల్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.వెంకటేశం, ఖమ్మం టు టౌన్ సీఐగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం ములుగు జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న సీ.హెచ్.శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ ఏ.వీ.రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. సత్తుపల్లి మండలంలో పలుచోట్ల పేకాట కేంద్రాలు కొనసాగుతున్నాయని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా తనిఖీలు చేయించారు. దీంతో పట్టుబడిన వారిని విచారించగా సత్తుపల్లి రూరల్ సీఐ వెంకటేశం తమకు దాడుల విషయమై ముందుగా సమాచారం ఇస్తున్నాడని, ఇందుకు ప్రతిఫలంగా నగదు అందజేస్తున్నామని వెల్లడించారు. ఈవిషయమై సీపీ సునీల్ దత్ ద్వారా విచారణ జరిపించి అందిన నివేదిక ఆధారంగా ఆయనను సస్పెండ్ చేశారు. ఇక ఖమ్మం టుటౌన్ సీఐగా 2022–23లో పనిచేసిన సీ.హెచ్.శ్రీధర్ ఓ జర్నలిస్ట్ ఇంట్లో తుపాకీ తూటాలు లభ్యమయ్యాయని బెదిరించి తప్పుడు కేసు నమోదు చేయడమే కాక 2022లో నమోదైన ఓ కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరిస్తూ కోర్టును తప్పుదోవ పట్టించినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపైనా సీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆయనను సైతం సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సత్తుపల్లి రూరల్ సీఐ వ్యవహారంపై 'సాక్షి'లో శుక్ర, శనివారం 'ఆడుకోండి, అండగా ఉంటాం.. దందాలకు కొమ్ము కాస్తే అంతే..' శీర్షికలతో కథనాలు రావడం, అప్పటికే ఆయన వ్యవహారంపై సీపీ నుంచి నివేదిక రావడంతో సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల్లో పర్యటన



లక్ష్మీదేవిపల్లి తండాలో కూలీలతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన సమావేశాల్లో మాట్లాడారు. అర్హులు కాకుండా పైరవీలతో సంక్షేమ పథకాలు పొందిన వారిని జాబితాల నుంచి తొలగించక తప్పదని తెలిపారు. వచ్చేనెల నుంచే రైతుల రుణమాఫీ మొదలవుతుందని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. అలాగే, త్వరలోనే ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రారంభించి మూడేళ్లలో అర్హులందరికీ అందిస్తామని తెలిపారు. అంతేకాకుండా పెన్షన్లు, రేషన్ కార్డుల పంపిణీ కూడా మొదలుపెడుతున్నట్లు వెల్లడించారు. కాగా, 40 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి చెక్కులను పంపిణీ చేయగా.. లక్ష్మీదేవిపల్లి తండా సమీపాన పంట పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు ఆరా తీశారు. ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, వివిధ శాఖల అధికారులు వెంకట్‌రెడ్డి, పుష్పలత, వాణిశ్రీ, వెంకటేశ్వరరావు, విజయచంద్ర, పీ.వీ.రామకృష్ణ శేషాద్రితో పాటు రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, అరవిందరెడ్డి పాల్గొన్నారు.

**మంత్రిపై బీఆర్‌ఎస్ నేత ప్రశంసలు**

నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా అమ్మగూడెంలో జరిగిన సభలో బీఆర్‌ఎస్ నాయకుడు గండు సతీష్ మాట్లాడుతూ పార్టీ ఏదైనా తన రోల్ మోడల్ శ్రీనివాసరెడ్డేనని తెలిపారు. పొంగులేటి తమ ఎమ్మెల్యే అని గర్వంగా చెప్పుకుంటున్నామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, రాయల నాగేశ్వరరావు, రావెళ్ల కృష్ణారావు, శాఖమూరి రమేష్, వి.సీతారాములు, కొడాలి గోవిందరావు, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు తీస్తారా.. వదిలేస్తారా?!

- సత్తుపల్లి–3 బ్లాక్‌పై నీలినీడలు
- రెండేళ్ల క్రితం వేలంలో దక్కించుకున్న 'అవంతికా'
- ఇప్పటివరకు మొదలుకాని ఉత్పత్తి
- సింగరేణికి అప్పగిస్తే 750 లక్షల టన్నుల వెలికితీతకు అవకాశం



సత్తుపల్లి సమీపంలోని జేవీఆర్ ఓసీ–2

సత్తుపల్లి: బొగ్గు గనుల వేలం అంశం సింగరేణి ఉద్యోగులు, కార్మికుల మెదళ్లను తొలచివేస్తోంది. కేంద్రప్రభుత్వం 2013లో చేసిన చట్టం గనులను వేలం ద్వారా కేటాయిస్తోంది. దీంతో సింగరేణి సంస్థ సహా ఎవరైనా వేలంలోనే గనులను దక్కించుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ బొగ్గు బ్లాక్‌లను పొందితే 14శాతానికి మించి రాయల్టీ కింద కేంద్రానికి చెల్లించాల్సి ఉండడంతో సంస్థకు ఆర్థిక భారంగా మారుతుంది. అలాకాకుండా తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను కూడా సింగరేణి సంస్థకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు. ఈమేరకు గతంలో సత్తుపల్లి – 3 బ్లాక్‌ను దక్కించుకున్న ప్రైవేట్ సంస్థ ఈనాటి వరకు బొగ్గు వెలికి తీయని విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఈ ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు మరికొన్నేళ్లలో ఖాళీ కానున్నందున సత్తుపల్లి – 3 బ్లాక్ సహా మిగతా బ్లాక్‌లను సైతం సింగరేణికే అప్పగించాలనే డిమాండ్ వస్తోంది.

**రెండేళ్ల క్రితం..**

సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌ను వేలంపాటలో అవంతికా ఇన్‌ఫ్రా రెండేళ్ల క్రితం దక్కించుకుంది. ఈనేపథ్యాన సత్తుపల్లి అర్బన్ పార్కు నుంచి రేజర్ల రెవెన్యూ పరిధిలో బొగ్గు తవ్వకానికి 243 ఎకరాలు భూమి కేటాయించారు. అయితే, సదరు సంస్థ రెండు, మూడు సార్లు సర్వే చేపట్టినా బొగ్గు మాత్రం తీయలేదు. ఈ ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు చేపట్టాలంటే మట్టి(ఓవర్ బర్డెన్) వేసేందుకు మరో 200 హెక్టార్ల భూమి అవసరమవుతుంది. అదీగాక 350 లక్షల టన్నుల బొగ్గు వెలికితీతే సాధ్యమవుతుంది. అలాగే, జేవీఆర్ ఓసీ–2కి సత్తుపల్లి–3 ఆనుకుని ఉండడం, సరిహద్దు ఆంక్షల కారణంగా సుమారు 200 లక్షల టన్నుల బొగ్గు కోల్పోవాల్సి రావడంతో ఆ సంస్థ పునరాలోచనలో పడినట్లు సమాచారం. రెండేళ్లుగా సంస్థ బాధ్యులు ఇటువైపు చూడకపోవడంతో గనిని వదిలేసుకున్నటేనని భావిస్తున్నారు.

**సింగరేణి సంస్థకు అప్పగిస్తే..**

సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు అప్పగిస్తే సంస్థ పరిధిలోని అత్యంత లాభసాటిగా నిలుస్తుందని చెబుతున్నారు. జేవీఆర్ ఓసీ–2 సరిహద్దు సమస్య లేకపోవడంతో 750 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీతకు అవకాశం ఏర్పడుతుంది. అలాగే, ఓవర్‌బర్డెన్ కోసం 200 హెక్టార్ల భూమి సేకరించాల్సిన అవసరం ఉండదు. ఇప్పటికే కొనసాగుతున్న జేవీఆర్ ఓసీ–2లో ఓవర్‌బర్డెన్(మట్టి) నింపే అవకాశముంది. దీనికి తోడు సింగరేణి సంస్థకు పటిష్టమైన కార్మిక, అధికార యంత్రాంగమే కాక అత్యాధునిక యంత్రాలు ఉండడంతో సాఫీగా ఉత్పత్తి సాగుతుంది. రైలుమార్గం ఉన్నందున రవాణా కూడా సులువుగా సాగనున్నందున సింగరేణికి కేటాయించాలని కార్మిక, ఉద్యోగులతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**మరో 20 ఏళ్ల వరకే నిల్వలు**

సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లిలో జేవీఆర్ ఓసీ–1, ఓసీ–2, కిష్టారం ఓసీలు ఉన్నాయి. జేవీఆర్ ఓసీ–1 కాలపరిమితి ముగియడంతో జేవీఆర్ ఓసీ–2 ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారు. దీని కాలపరిమితి మరో ఇరవై ఏళ్లు ఉండగా, కిష్టారం ఓసీ కాల పరిమితి ఆరేళ్లలో ముగియనుంది. ఇకనైనా మరో బ్లాక్ కేటాయించకపోతే ఇరవై ఏళ్ల తర్వాత సింగరేణి సంస్థ సత్తుపల్లి నుంచి వైదొలగాల్సి ఉంటుంది. ఈనేపథ్యాన ఉద్యోగులు, కార్మికులే కాక స్థానికుల జీవితాలపై ప్రభావం పడకుండా తెలంగాణలోని గనులను సంస్థకు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

## పోలీస్ ఉద్యోగులకు ఉత్తమ సేవా, సేవా పతకాలు

- జాబితాలో జిల్లా నుంచి 15మంది

ఖమ్మంక్రైం: విధినిర్వహణలో కనబర్చిన ప్రతిభకుగాను జిల్లాలో పలువురు పోలీసు ఉద్యోగులకు ప్రభుత్వం ఉత్తమ సేవా, సేవా పతకాలను ప్రకటించింది. ఈమేరకు ఖమ్మం ఐటీ కోర్ ఎస్‌ఐ సత్యనారాయణ ఉత్తమ సేవాపతకానికి ఎంపికయ్యారు. అలాగే, సేవా పతకాలకు సీసీఆర్బీ ఏసీపీ(ఫంక్షనల్ వర్టికల్స్) యు.సాంబరాజు, ఏఎస్‌ఐలు ఎన్.శ్రీనివాసరావు(సీ ఎస్‌బీ), కె.వెంకటేశ్వర్లు(కామేపల్లి), సయ్యద్ సలీ మాబేగం(పీసీఆర్), ఏఆర్ ఎస్సైలు పి.కృష్ణయ్య, ఎస్.కే.యాకూబ్‌పాషా, బి.హరిబాబు, జి.వెంకటసుబ్బారావు, జి.సూర్యారావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు జి.గోపి, బి.హనుమ, హెడ్ కానిస్టేబుళ్లు ఎండీ.ఖాజామియా, కె.మోహన్‌రావుతో పాటు కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు ఎంపికైనట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## అంతర్జాతీయ స్థాయిలో ఖమ్మం మార్కెట్



ప్రతిపాదనలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో మిర్చి మార్కెట్ నిర్మాణం జరగనుంది. పదిహేను ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ ఉండగా.. ఉమ్మడి ఖమ్మం నుంచే కాక ప్రాంతాల నుంచి మిర్చిని తీసుకొస్తుండడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. సీజన్‌లో లక్ష కంటే ఎక్కువ మిర్చి బస్తాలు వచ్చినప్పుడు స్థలం సరిపోవడం లేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌లో నూతన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈమేరకు రూ.148కోట్ల అంచనాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలను శనివారం పరిశీలించిన మార్పులు, చేర్పులపై సూచనలు చేశారు.

# 'ధరణి'పై దృష్టి..

- జిల్లాలో 8,340 దరఖాస్తుల పెండింగ్
- వారంలోగా పరిష్కరించేలా కసరత్తు



దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ధరణి దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించింది. జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 8,340 దరఖాస్తులు వివిధ స్థాయిల్లో పెండింగ్ ఉన్నట్లు యంత్రాంగం గుర్తించింది. వీటన్నింటినీ త్వరగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో అధికారులంతా ఇదే పనిలో నిమగ్నమయ్యారు.

**మొత్తం 78,710 దరఖాస్తులు**

ధరణి సైట్ అందుబాటులోకి వచ్చాక ఇప్పటివరకు వివిధ అంశాలపై మొత్తంగా 78,710 దరఖాస్తులు అందాయి. వీటిలో 57,101 దరఖాస్తులను పరిష్కరించి పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేశారు. ఇక 13,269 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించగా.. 8,340 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో తహసీల్దార్ స్థాయిలో 4,254, ఆర్డీఓ స్థాయిలో 1,382, అదనపు కలెక్టర్ స్థాయిలో 1,556 ఉండగా... మిగతావి ఉన్నతాధికారి స్థాయిలో పరిష్కరించాల్సి ఉంది. ఈనేపథ్యాన అన్ని దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.ఈ మేరకు అధికార యంత్రాంగం ఆఘమేఘాలపై పరిశీలిస్తూ లక్ష్యాన్ని చేరుకోవడంపై దృష్టి సారించారు.

**పరిష్కరిస్తున్నాం**

జిల్లాలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి సారించాం. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. ఇప్పటికే తహసీల్దార్లతో సమీక్షలు నిర్వహించాం. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులన్నీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డి.మధుసూదన్ నాయక్, అదనపు కలెక్టర్

## క్లుప్తంగా

### ఎస్‌బీఐ ఆఫీసర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఇబ్రహీం


షేక్ ఇబ్రహీం

తిరుమలాయపాలెం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆఫీసర్ల అసోసియేషన్ హైదరాబాద్ సర్కిల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా షేక్ ఇబ్రహీం ఎన్నికయ్యారు. తిరుమలాయపాలెం మండలం గోల్‌తండా గ్రామపంచాయతీ పరిధి జింకలగూడెంకు చెందిన ఆయన ప్రస్తుతం ఎస్‌బీఐ ఖమ్మం మెయిన్ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమేరకు శుక్రవారం జరిగిన ఎన్నికల్లో హైదరాబాద్ సర్కిల్ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా ఆయన విజయం సాధించారు. గతంలో ఖమ్మం చర్చి రోడ్డు శాఖలో ఫీల్డ్ ఆఫీసర్‌గా, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించిన ఇబ్రహీంను బ్యాంకు ఉద్యోగులు, మండల ప్రజలు అభినందించారు.

### రోడ్డెక్కిన ఫుడ్ సేఫ్టీ వాహనం

సాక్షి ఎఫెక్ట్..


ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎట్టకేలకు ఫుడ్ సేఫ్టీ వాహనం రోడ్డెక్కింది. 'రోడ్డెక్కని ఫుడ్ సేఫ్టీ వాహనం' శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు వాహనాన్ని ఎట్టకేలకు ఖమ్మం కలెక్టరేట్ నుంచి బయటకు తీసుకొచ్చి శనివారం నల్లగొండ జిల్లాలోని సంక్షేమ వసతిగృహాల్లో ఆహార తనిఖీల కోసం పంపించారు. మూడు నెలలుగా వాహనం ఖమ్మం కలెక్టరేట్‌లో ఉంటుండగా, డ్రైవర్‌ను అధికారులు సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారనే విమర్శలు వచ్చాయి.

### 28 నుంచి సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ రాష్ట్రస్థాయి సమావేశాలను ఈ నెల 28 నుంచి 30 వరకు ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఈ నెల 28న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం, 29, 30వ తేదీల్లో కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. సమావేశాలకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరవుతారన్నారు. గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు.

### ఒలింపిక్ రన్ రద్దు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన ఆదివారం జరగాల్సిన ఒలింపిక్ రన్‌ను రద్దు చేసినట్లు అసోసియేషన్ కార్యదర్శి కె.క్రిస్టోఫర్‌బాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయం తీసుకున్నందున క్రీడాకారులు, ఔత్సాహికులు గమనించాలని ఆయన ఓ ప్రకటనలో సూచించారు.

### స్తంభం ఎక్కే పరీక్షలో విఫలం

ఖమ్మంవ్యవసాయం: జూనియర్ లైన్లమెన్ల ఎంపికకు శనివారం ఖమ్మంలోని సర్కిల్‌కార్యాలయంలో స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా జేఎల్‌ఎంల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుండగా, ఇప్పటి వరకు ఏడు విడతల్లో పరీక్షలు నిర్వహించారు. శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు అభ్యర్థులకు స్తంభం ఎక్కే పరీక్ష నిర్వహించగా వారిద్దరూ విఫలమయ్యారు. దీంతో జాబితాలో వీరి తర్వాత ఉన్న మరో ఇద్దరికి త్వరలో పరీక్ష నిర్వహించే అవకాశముంది. పరీక్షలను ఖమ్మం ఎస్‌ఈ ఎ.సురేందర్, అధికారులు పర్యవేక్షించారు.

### మిర్చి రైతులకు రూ.2.20 కోట్ల మేర టోకరా

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలం ములుగుమాడుకు మిర్చి వ్యాపారి ఖరీదు కృష్ణారావు రూ.2.20కోట్ల మేర రైతులకు టోకరా పెట్టాడు. ఈ విషయమై బాధిత రైతులు రామకృష్ణ, శేఖర్, బాలకృష్ణ తదితరులు శనివారం ఎర్రుపాలెం పోలీసులతో పాటు మధిర సీఐ మధుకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యాపారి ఖరీదు కృష్ణారావు గత నాలుగేళ్లుగా గ్రామంలో రైతుల వద్ద మిర్చి కొనుగోలు చేస్తూ సక్రమంగానే నగదు చెల్లించాడు. ఈ ఏడాది కూడా దాదాపు 70మంది రైతులు రూ.2.20కోట్ల విలువైన వెయ్యి క్వింటాళ్ల మిర్చిని ఆయనకు విక్రయించారు. అయితే, రైతులు డబ్బు అడిగినప్పుడల్లా వాయిదా వేస్తూ వచ్చినాయన ఈనెల 18న ఇంటికి తాళం వేసి కనిపించకుండా పోయాడు. దీంతో వ్యాపారి మోసం చేసినట్లు గుర్తించిన రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### యువకుడిపై పోక్సో కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ఒక కాలనీకి చెందిన పదిహేనేళ్ల బాలికకు క్రీడల్లో శిక్షణ పేరిట నమ్మించి తీసుకెళ్లిన యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఖమ్మం తుమ్మలగడ్డకు చెందిన కుమార్ వారం క్రితం సదరు విద్యార్థినిని తీసుకెళ్లగా తొలుత ఆమె తల్లి ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం బాలిక, ఆ యువకుడిని తీసుకొచ్చిన పోలీసులు కేసును పోక్సో చట్టం కిందకు మార్చి ఆయనను కోర్టులో హాజరుపరిచారు.

# జవాన్ల చేతివాటం




**కేఎంసీలో పైసా వసూల్..**
- కార్మికుల నుండి డబ్బుల డిమాండ్
- జవాన్లకు మద్దతుగా ఓ కార్మిక సంఘం నేత పైరవీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొందరు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల తీరు విమర్శలకు తావిస్తోంది. నగరంలోని డివిజన్లలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ, కార్మికుల చేత పని చేయించాల్సిన జవాన్లు వసూళ్లకు దిగుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కార్మిక సంఘాల నాయకుల అండతో క్షేత్రస్థాయిలో కార్మికులను వేధిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. కార్మికుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు జవాన్లుహాజరు వేయాలన్నా, పనిలో కొనసాగించాలన్నా డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదేసమాయన జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఓ సంఘం నాయకుడు వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం.

**అధికారులకు ఫిర్యాదు**

కేఎంసీ పరిధిలోని అర్బన్ ప్రాంత ఓ డివిజన్‌లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికురాలు సక్రమంగా విధులకు రావడం లేదనే సాకుతో జవాన్ డబ్బు డిమాండ్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. రోజురోజుకు జవాన్ వేధింపులు పెరగడంతో ఆమె ఓ సంఘం నాయకుడి సాయంతో శనివారం కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారి సదరు జవాన్‌ను పిలిచి మందలించడమేకాక రిజిస్టర్లు స్వాధీనం చేసుకున్నాడు. ఇంతలోనే మరో కార్మిక సంఘం నేత రంగంలోకి దిగి జవాన్‌పై చర్యలు తీసుకోవద్దని అధికారులకు సూచించినట్లు తెలిసింది. అధికారి మాత్రం విచారణ అనంతరం తప్పు చేసినట్లు తేలితే చర్యలు తప్పవని స్పష్టం చేసినట్లు సమాచారం. అయితే పలువురు జవాన్లు గతంలోనూ డబ్బు కోసం కార్మికులను వేధించారనే ఆరోపణలపై అధికారులకు ఫిర్యాదులు అందాయి.

**కార్మిక సంఘాల నడుమ ఆధిపత్య పోరు**

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్మిక సంఘాల ఆధిపత్య పోరు మొదలైందనే చర్చ జరుగుతోంది. ఓ మహిళా కార్మికురాలు జవాన్ వేధింపులపై ఒక సంఘం నాయకుడి సాయంతో ఫిర్యాదు చేస్తే... ఇంకో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆ సంఘం నేతల వద్దకు ఎందుకు వెళ్లావంటూ కార్మికురాలిని ప్రశ్నించినట్లు సమాచారం. ఇంతలోనే యితే జవాన్ పక్షాన ఇంకో కార్మిక సంఘం నాయకుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అధికారి వద్దకు వెళ్లి వాదించడంతో కార్మిక సంఘాల మధ్య ఆధిపత్య పోరు బయటపడినట్లయింది. కార్మికుల సమస్యలపై పోరాడాల్సిన నాయకుడు తమ పబ్బం గడుపుకునేందుకు జవాన్లకు వత్తాసు పలుకుతుండడం విమర్శలకు తావిస్తోంది.

**ఫిర్యాదు అందింది..**

జవాన్ డబ్బు కోసం వేదిస్తున్నాడన్న ఓ మహిళా కార్మికురాలు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ చేస్తున్నాం. డబ్బు డిమాండ్ చేసిన జవాన్‌ను పిలిపించి ఇప్పటికే మాట్లాడాం. పూర్తిస్థాయిలో విచారణ అనంతరం చర్యలు తీసుకుంటాం.

– సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్

# జాతిసంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్న బీజేపీ

- సింగరేణికి బొగ్గు గనులు కేటాయించకపోతే ఉనికికే ముప్పు
- రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ హర్షణీయం
- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలోని బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకే కేంద్ర ప్రభుత్వం వేలం నిర్వహిస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. అలాకాకుండా గనులను కోల్ ఇండియా, సింగరేణి లాంటి ప్రభుత్వ సంస్థలకు అప్పగించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వదేశీ, మోదీ గ్యారంటీ నినాదాలతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రక్రియను వేగంగా అమలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే 300 బొగ్గు బ్లాక్‌లను కంపెనీలకు ధారాదత్తం చేయగా.. మరో 60 గనుల వేలం నిర్వహిస్తున్నారని తెలిపారు. గనులను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించి, థర్మల్ స్టేషన్లకు కావాల్సిన బొగ్గును మళ్లీ వారి నుంచి కొనుగోలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తద్వారా ప్రభుత్వంపై భారమే తప్ప లాభముండదని తెలిపారు. ఇకనైనా సింగరేణి సంస్థకు గనులు కేటాయించకపోతే రానున్న పదేళ్లలో సంస్థ ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు గనుల వేలానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నందున రాజకీయ పక్షాలు, కార్మిక సంఘాలు నిరసన తెలపాలని రంగారావు పిలుపునిచ్చారు.

**నిరుద్యోగులకు ఆశనిపాతం..**

బీజేపీ హయాంలో 70కి పైగా పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ అయ్యాయని రంగారావు మండిపడ్డారు. ఈ అంశాలపై సుప్రీం కోర్టు జడ్జితో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్రంలో రైతుల పంటల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని తెలిపారు. ఇదే సమయాన కొత్త రుణాలు సైతం మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, కమ్మకోమటి నాగేశ్వరరావు, బందెల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లు అందుకుంటున్న మత్స్యకారులు

కూసుమంచి: మండలంలోని పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్యకారులకు ఇస్తున్న మూడు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మత్స్యకారులకు ఎంపీటీసీ శీలం నాగమణి, శాస్త్రవేత్తలు సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్యాంప్రసాద్ చేపల పెంపకం, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రీ సర్క్యులేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్‌తో అనేక ప్రయోజనాలు ఉన్నందున మత్స్యకారులు లాభసాటి విధానాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే, సీనియర్ రీసెర్చ్ ఫెలోలు భార్గవి, నాగరాజు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

# జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం

**ఖమ్మంలో రహదారులపైకి చేరిన వరద**


ఖమ్మం హర్కారా బావి సెంటర్‌లో రహదారిపైకి చేరిన వరద

ఖమ్మంవ్యవసాయం: రైతులు వానల కోసం ఎదురు చూస్తుండగా.. వరుణుడు కాస్త కరుణించాడు. సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు దాటుతున్నా సరైన స్థాయిలో వర్షం కురవలేదు. ఈ నేపథ్యాన శనివారం సాయంత్రం జిల్లాలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో రాత్రి 7గంటల సమయాన కురిసిన వర్షంతో శ్రీనివాస్ నగర్, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, మార్కెట్‌రోడ్, హర్కారా బావిసెంటర్, వర్తక సంఘం, పాట్టి శ్రీరాములు రోడ్లలో నాలాలు పొంగి ప్రవహించాయి. దీంతో రహదారులపైకి నీరు చేరి వాహనదారులు ఇబ్బంది పడ్డారు.ఇక సత్తుపల్లి, మధిర, వైరా, కూసుమంచి వ్యవసాయ డివిజన్లలో కూడా తేలిక పాటి వర్షపాతం నమోదైంది. కాగా, జిల్లాకేంద్రంలోని ప్రకాష్‌నగర్‌లో అత్యధికంగా 32.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

**పంటలకు ప్రయోజనం**

అకాల వర్షాలతో దుక్కులు సిద్ధం చేసుకున్న రైతులు కొన్నిచోట్ల వివిధ రకాల పంటల విత్తనాలు విత్తారు. ఆపై ఆశించిన వర్షం లేక విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో కొన్నిచోట్ల మళ్లీ విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతుండగా.. ప్రస్తుతం కురిసిన వాన పైర్లకు ప్రయోజనం ఉంటుందని రైతులు, వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

### చోరీ కేసుల్లో నిందితుడు అరెస్ట్

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని మూడు షాపుల్లో శుక్రవారం దొంగతనం చేసిన కేసులో నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. సూర్యాపేట జిల్లా చింతలపల్లి మండలం యర్రగుంట తండాకు చెందిన గుగులోత్ నాగరాజు శుక్రవారం అర్ధరాత్రి నగరంలోని మోహన్‌సాయి మోటార్స్, విజయసాయి మోటార్స్, ఏషియన్ పెయింట్స్ దుకాణాలలో చోరీకి పాల్పడ్డాడు. ఈమేరకు విచారణ అనంతరం నిందితుడిని గుర్తించి పాతబస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

# విద్యార్థుల హాజరుశాతం పెంచాలి


తిరుమలాయపాలెం పాఠశాలలో విద్యార్థితో లెక్కలు చేయిస్తున్న డీఈఓ శర్మ

తిరుమలాయపాలెం/ముదిగొండ: పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు ముదిగొండ మండలం యడవల్లి, మేడేపల్లి, మాదాపురం గ్రామాల్లోని పాఠశాలలను డీఈఓ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విద్యార్థి పాఠశాలకు రాకున్నా కారణాలు తెలుసుకోవాలని, ప్రతిరోజు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆతర్వాత విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల్లో ప్రతిభను పరీక్షించారు. కాగా, పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఈనెల 25వ తేదీ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీఈఓ ఆదేశించారు. ఈతనిఖీల్లో హెచ్‌ఎంలు విజయకుమారి, వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

రఘునాథపాలెం: తమ బిడ్డలు ఉన్నతి స్థితికి ఎదగాలనే తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేలా విద్యార్థులు కష్టపడి చదవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెం జెడ్పీహెచ్‌ఎస్‌ను శనివారం తనిఖీ చేసిన ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ఆరంభం నుంచే శ్రద్ధగా చదివితే మంచి మార్కులు వస్తాయని తెలిపారు. ఆతర్వాత మధ్యాహ్న భోజన తయారీ గది, భోజనం నాణ్యతను పరిశీలించారు. హెచ్‌ఎం శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**హైవే నిర్మాణంపై సమీక్ష**

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం – కోదాడ జాతీయ రహదారి నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. నేలకొండపల్లి మండలంలోని పైనంపల్లిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాల కొరత లేదు..

**జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల**


జీలుగు పంటను పరిశీలిస్తున్న డీఏఓ

సత్తుపల్లిరూరల్: జిల్లాలో సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. ఎక్కడా కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల స్పష్టం చేశారు. సత్తుపల్లిలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను శనివారం తనిఖీ చేసిన ఆమె నారాయణపురం, తాళ్లమడల్లో సాగుచేసిన జీలుగు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ విత్తనాల లభ్యతపై రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ఏడీ వై.శ్రీనివాసరావు, హెచ్‌ఓ వేణు, ఏఈఓలు ఆశా జ్యోతి, నరేష్ పాల్గొన్నారు.

**రశీదులు భద్రపర్చుకోండి**

బోనకల్: రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన రశీదులను పంటకాలం పూర్తయ్యే భద్రపర్చుకోవాలని డీఏఓ విజయనిర్మల సూచించారు. బోనకల్ మండలం లక్ష్మీపురంలో పత్తి, జనుము, జీలుగు పైర్లను శనివారం పరిశీలించిన ఆమె పలు సూచనలు చేశారు. 60 మి.మీ. వర్షపాతం నమోదైనప్పుడే పత్తి విత్తనాలు నాటాలని, విత్తనాల రశీదు, ప్యాకెట్‌ను భద్రపర్చుకోవాలని తెలిపారు. ఏఓ సరిత, ఏఈఓ కార్తీక్ పాల్గొన్నారు.

# భూవివాదంలో తండ్రీకొడుకులపై దాడి

**తీవ్రంగా గాయపడిన ఇద్దరు**


స్థానికులను విచారిస్తున్న సీఐ సాగర్

కొణిజర్ల: పొలం దారి విషయంలో తండ్రీకొడుకులపై ఇద్దరు దాడి చేసిన ఘటన కొణిజర్ల మండలం సింగరాయపాలెంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన కంకణాల శ్రీను, బొల్లెపోగు వెంకటికి పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. వెంకటి తన చేనుకు శ్రీను చేనులో నుంచి వచ్చివెళ్తున్నాడు. ఇటీవల దారి ఇచ్చేది లేదని శ్రీను తేల్చిచెప్పగా, మూడు నెలలుగా గొడవ జరుగుతుండడంతో పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టించారు. ఇంతలోనే ఐదు రోజుల క్రితం శ్రీను తన పొలంలో వరద కాల్వ తీయిస్తే వెంకటి గొడవకు దిగాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి శ్రీను, ఆయన కుమారుడు అవినాష్ కాలనీ పెద్ద అయిన మేడి కొండలరావు ఇంటి వద్ద సమస్యను వివరిస్తుండగా పక్క ఇంట్లో ఉండే వెంకటి, ఆయన కొడుకు వంశీ చేరుకుని వారిద్దరిపై కారం పొడి చల్లి గొడ్డలి, రాడ్లతో దాడి చేయడంతో శ్రీను, అవినాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు వారిని కొండలరావు ఆటోలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి, ఆతర్వాత ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, ప్రస్తుతం శ్రీను పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే, గొడవ అనంతరం వెంకటి, వంశీపై కాలనీవాసులు దాడికి యత్నించగా వారు ఇంట్లోకి వెళ్లి స్థానికులపై కారం చల్లి దాడి చేశారు. ఈవిషయం తెలుసుకున్న వైరా సీఐ సాగర్, కొణిజర్ల, వైరా, చింతకాని ఎస్సైలు చేరుకుని నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై శ్రీను తమ్ముడు వెంకటకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# మధ్యవర్తి ఇంటి ఎదుట 'చైన్' బాధితుల ఆందోళన

నేలకొండపల్లి: ఒసారి చెల్లిస్తే నగదు రెట్టింపు అవుతుందని నమ్మించి మోసం చేసిన సంస్థ బాధ్యులపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆందోళన బాట పట్టారు. నేలకొండపల్లి మండలానికి చెందిన పలువురు ఓ మధ్యవర్తి, ఏజెంట్ ద్వారా కొన్నాళ్ల క్రితం డబ్బులు చెల్లించారు. కొంత మొత్తం చెల్లించి ఇంకొందరిని చేర్పిస్తే డబ్బు రెట్టింపు అవుతుందని చెప్పడంతో నమ్మగా, చివరకు డబ్బు తిరిగి రాలేదు. దీంతో శనివారం వారంతా మండల కేంద్రంలోని మధ్యవర్తి ఇంటి వద్ద ఆందోళన చేశాక ఆయనను మార్కెట్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లారు. అక్కడికి ప్రధాన ఏజెంట్‌ను కూడా పిలిపించారు. అయితే, తాను కూడా పెద్ద మొత్తంలో డబ్బు పెట్టినట్లు చెప్పిన మధ్యవర్తి తనతో పాటు హైదరాబాద్ వస్తే నిర్వాహకులను కలిపిస్తానని పేర్కొన్నారు. ఆతర్వాత ఇంకొందరు ప్రధాన ఏజెంట్ ఇంటి ఎదుట ఆందోళనకు దిగగా ఆయన రెండు రోజుల్లో డబ్బు ఇప్పిస్తానని చెప్పినట్లు సమాచారం. ఈ వ్యవహారం బయటకు రావడంతో నేలకొండపల్లి పోలీసులు చేరుకుని వివరాలు ఆరాతీశారు. కాగా, సదరు సంస్థలో నేలకొండపల్లి, ముదిగొండ మండలాలకు చెందిన పలువురు ఏజెంట్లు డబ్బులు కట్టించినట్లు తెలుస్తుండగా, ఓ ఏజెంట్ ఇటీవల ఆత్మహత్యకు యత్నించాడు. అయితే, ఘటనపై ఇప్పటివరకు ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.



### పండితాపురం సంత వేలం మళ్లీ వాయిదా

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి (పండితాపురం)లోని శ్రీ కృష్ణప్రసాద్ పశువుల వారాంతపు సంత వేలం శనివారం కూడా వాయిదా పడింది. వేలం పాట తొలిసారి గురువారం నిర్వహించగా ప్రభుత్వ మద్దతు ధర అయిన రూ.1,84,70,646 రాకపోవడంతో వాయిదా వేసిన విషయం విదితమే. శనివారం రెండోసారి జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఎంపీడీఓ రవీందర్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈసారి ముగ్గురు పాల్గొన్నప్పటికీ భూక్యా వీరన్న అత్యధికంగా రూ.1.30 కోట్లకు పాడారు. దీంతో మద్దతు ధర రానందున వాయిదా వేసిన అధికారులు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది ప్రకటించలేదు. సీఐ తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేయగా, కొండాయిగూడెం సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, ఎంపీఓలు రాజారావు, జీవీఎస్ సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంక్ లాకర్‌లో సొత్తు మాయం

సత్తుపల్లిటౌన్: బ్యాంక్ లాకర్ భద్రపర్చిన సొత్తు మాయమైందని ఓ మహిళ సత్తుపల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌లో నివాసముంటున్న ఎం.డీ.ఫరాజ్ 11 ఏళ్ల క్రితం ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో లాకర్ తీసుకున్నారు. గతేడాది ఆగస్టు 2వ తేదీన ఆమె సుమారు రూ.9.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను లాకర్‌లో భద్రపరిచారు. అయితే, ఈనెల 12వ తేదీన బ్యాంక్ మేనేజర్ ఫోన్ చేసి లాకర్ బయటకు వచ్చినట్లు కనిపిస్తున్నందున ఓసారి వచ్చి సరిచూసుకోవాలని సూచించారు. దీంతో ఈనెల 19వ తేదీన ఆమె పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు మాయమైనట్లు గుర్తించారు. ఈ విషయమై బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదిస్తే మధ్యలో వచ్చి నగలు తీసుకెళ్లి ఉంటారని చెప్పటంతో ఆమె సత్తుపల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కాగా, బ్యాంక్‌కు సెలవులు కావడంతో సోమవారం విచారణ జరుపుతామని సీఐ టి.కిరణ్ తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య కేసులో ఐదుగురిపై కేసు

కొణిజర్ల: కొణిజర్ల మండలం మేకాలకుంటకు చెందిన భూక్యా సక్రియ ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు వైరా సీఐ ఎస్.సాగర్ తెలిపారు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన ఎస్‌ఐ జె.శంకరరావుతో కలిసి వివరాలు వెల్లడించారు. సక్రియకు గ్రామంలో 30 గుంటల భూమి ఉండగా దాని పక్కనే వేమూరి సత్యనారాయణ సంబంధించిన భూమి ఉండడంతో ఇరువురి మధ్య గట్టు వివాదం నడుస్తోందని తెలిపారు. ఇటీవల సర్వేయర్ ఏర్పాటుచేసిన హద్దుల ప్రకారం సక్రియా గట్టు వేసుకుంటుండగా సత్యనారాయణ కుమారుడు అజయ్, పొలం కౌలు చేస్తున్న బానోత్ కృష్ణ, ఆయన భార్య బుజ్జి గొడవకు దిగి కొట్టారని, వీరికి తేజావత్ మదన్, చింతల మల్లయ్య సహకరించారని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన సక్రియా ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు.ఈ నేపథ్యాన ఐదుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

# బెంగళూరులో సత్తుపల్లి యువకుడు మృతి

- కారు ఢీకొనడంతో కన్నుమూత
- రైలు ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితుల యత్నం


ప్రకాష్ (ఫైల్)

సత్తుపల్లిటౌన్: కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండడంతో ఆనందిస్తున్న ఆ పేద కుటుంబానికి విషాదమే మిగిలింది. రోడ్డు ప్రమాదంలో యువకుడు కన్నుమూయగా, కారకులైన వ్యక్తులు రైలు ఢీకొని మృతి చెందినట్లు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ఈఘటన శుక్రవారం రాత్రి బెంగళూరులో జరిగింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి జవహర్‌నగర్ కాలనీకి చెందిన అముదాల అబ్రహం – మారెమ్మ కుమారుడు ప్రకాష్(22) బీటెక్ పూర్తి చేశాక బెంగళూరులోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈనెల 15వ తేదీన అక్కడ ఉద్యోగంలో చేరిన ఆయన శుక్రవారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు తన గది నుంచి ఆఫీస్‌కు బయలుదేరాడు. అయితే, రైలుపట్టాలపై తీవ్ర గాయాలతో ప్రకాష్ మృతి చెందాడని అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారంతో సత్తుపల్లి నుంచి తల్లిదండ్రులు, బంధువులు బయలదేరారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు వద్ద ప్రకాశ్ తల్లి స్పృహ కోల్పోవడంతో అక్కడి ఆస్పత్రిలో చేర్పించి మిగతా వారు బెంగళూరు వెళ్లారు. కాగా, ఆయన తండ్రి అబ్రహం భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బెంగళూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శనివారం రాత్రి కుటుంబ సభ్యులకు ప్రకాష్ మృతదేహాన్ని అప్పగించారు.

**రైలు ఢీకొన్నట్లు చిత్రీకరణ...**

ప్రకాష్ మృతి సమాచారం అందుకున్న బంధువులు వెళ్లేసరికి రైలుపట్టాలపై తీవ్ర గాయాలతో ప్రకాష్ మృతి చెంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, ప్రకాష్ నివాసముండే ప్రాంతం, రైలు పట్టాలు ఉన్న ప్రాంతానికి సంబంధం లేకపోవడంతో వారు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో బెంగళూరు పోలీసులు సీసీ టీవీల ఫుటేజీలను పరిశీలించగా కారు ఢీకొనడంతో ప్రకాష్ మృతి చెందినట్లు తేలింది. ఆపై నిందితులు మృతదేహాన్ని రైల్వే పట్టాలపై వేసి రైలు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేసినట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.